# ధాన్యం రవాణాకు సరిపడా లారీలను కేటాయించాలి





## జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లా లో కొనుగోలు చేసిన వరి ధాన్యం రవాణాకు సరిపడా లారీలను కేటాయించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు సూచించారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని తన ఛాంబర్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి లారీల అసోసియేషన్ గుత్తేదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం కొనుగోలు జరుగుతోందని తెలిపారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులు, గోదాములకు సకాలంలో తరలించాల్సిన అవసరం ఉందన్నారు. అవసరానికి తగినట్లు లారీలను కేటాయించి, రవాణా ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ రవీందర్ రావుతో కలిసి సహకార సంఘాల కార్యదర్శులతో వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో కేవలం నాణ్యమైన ఎఫ్ఏక్యూ వరి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని, రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు అనంతరం రైస్ మిల్లులకు వేగంగా తరలించి ట్రక్ చిట్లు త్వరితగతిన పొందాలని, ట్యాబ్‌లలో తక్షణ నమోదు చేసి రైతులకు సకాలంలో నగదు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితో పర్యాటక రంగం అభివృద్ధి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** సమిష్టి కృషితో పర్యాటక రంగం అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా పర్యాటక రంగాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు రూపొందించిన ప్రత్యేక 'టూరిజం కిట్'ను శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను చాటిచెప్పేలా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ కిట్‌ను ఆకర్షణీయంగా రూపొందించామని తెలిపారు. పర్యాటక రంగానికి సంబంధించిన సమగ్ర సమాచారంతో జిల్లా టూరిజం బుక్, పెన్ను, పేపర్ వెయిట్, కీచైన్‌లతో పాటు టీ కప్పులపై ఉపయోగించే ప్రత్యేక కవర్లు ఈ కిట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. జిల్లా పర్యాటక అభివృద్ధి కి ఈ కిట్ ఒక ప్రచార సాధనంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి రవికుమార్, డీఆర్‌డీఓ రవీందర్, డీఎంహెచ్‌ఓ నరేందర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా తదితరులు పాల్గొన్నారు.

# యువత ఆరోగ్యమే సమాజ ఆరోగ్యానికి పునాది

## జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయం వ్యాయామం, యోగా కోసం కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య సూచించారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన క్రీడా ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంతరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్ట ర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా ఈనెల 18 నుంచి 23 వరకు జిల్లా లో క్రీడా శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ, మారథాన్, కెరీర్, స్కిల్ డెవలప్మెంట్, యూత్ లీడర్షిప్ సమ్మిట్, స్పోర్ట్స్ డే, యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ, ఉద్యోగ సాధనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. యువతలో ఆరోగ్యకర జీవనశైలి, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల నియంత్రణ, ప్లా స్టిక్ రహిత సమాజ నిర్మాణంపై ప్రత్యేకంగా చర్చలు, పోటీలు నిర్వహించామని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసినట్లు చెప్పారు. అనంతరం చిత్రలేఖనం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువత, విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.





# సీఎం సభను విజయవంతం చేయాలి

## డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పిలుపునిచ్చారు. శనివారం తిర్యాణి మండల కేంద్రంలో ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రాంచందర్ స్వగృహంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆమెతో పాటు ఎరుకల మంగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ సీఎం సభకు ప్రతి గ్రామం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సభ విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బుద్దె విజయ్, కార్యదర్శి కురిసేంగ శోభన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేముల హేమలతతో పాటు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా విభాగం నాయకులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మాదిగ హక్కుల దండోరా నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. నాయకులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లా డుతూ మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి మార్కెట్‌ను అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం జొన్నల కొనుగోలు ప్రక్రియ సాఫీగా కొనసాగుతోందని, లారీల కొరత, గోనె సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే వెయింగ్, లోడింగ్ పనుల కోసం అవసరమైన లేబర్ కొరత లేకుండా జిల్లా కలెక్టర్ సహకారంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కొనుగోలు చేసిన జొన్నలను నిల్వ చేయడానికి దర్శిత్ ఆగ్రోటెక్ లిమిటెడ్ గోడౌన్‌ను లీజుకు తీసుకున్నామని వివరించారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు బండారి అశోక్, మహిళా అధ్యక్షురాలు తోకల గంగమ్మ, గౌరవ అధ్యక్షుడు బొజ్జ అడెల్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుద్దాల శివకుమార్, జైనథ్ మండల అధ్యక్షుడు జవారి విఠల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బండ మాదారంలో వైభవంగా జరిగిన పెద్దమ్మ తల్లి, బొడ్రాయి ఉత్సవాలు

## పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్

**ఉద్యమ కెరటం,మేడ్చల్**

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు బండ మాదారంలో పెద్దమ్మ తల్లి, బొడ్రాయి పండుగ మహోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి మల్కాజ్‌గిరి పార్ల మెంట్ సభ్యులు (ఎంపీ) ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీకి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పట్లో ళ్లవిక్రం రెడ్డి, బుద్ధి శ్రీనివాస్, గౌరారం జగన్ గౌడ్, అమరం మోహన్ రెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రజిత దేవేందర్ రెడ్డి, దొడ్ల మల్లి కార్జున్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

## అధికారులతో పీఏసీ చైర్మన్ సమీక్ష

**ఉద్యమ కెరటం,కూకట్‌పల్లి:**

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తూ, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా అధికారులు కృషి చేయాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆదేశించారు. శనివారం మియాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి పనులపై డెప్యూటీ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లా డుతూ.. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్ల కొరకు నిజమైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో నియోజకవర్గా న్ని అగ్రగామిగా నిలుపుతామని, త్వరలోనే ఎల్లమ్మబండలో మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. సమావేశంలో డీసీలు శశిరేఖ, సేవా ఇస్లావాత్, బాలకృష్ణ, ఏఎంసీ వహీద్ అలీ, డెప్యూటీ తహసీల్దార్ దిలీప్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు మల్లీ శ్వరి, సురేష్ పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో సైబర్ కేసు నమోదు

- **కౌలు రైతు ఖాతా నుంచి రూ.2.28 లక్షలు కాజేసిన కేటుగాళ్లు**

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వీఎం బంజర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ మోసం ఘటన వెలుగులోకి వచ్చింది. పెనుబల్లి మండలం కొండ్రుపాడు గ్రామానికి చెందిన ఓ కౌలు రైతు బ్యాంకు ఖాతా నుంచి దఫాల వారీగా రూ.2లక్షల 28వేలు సైబర్ కేటుగాళ్లు కాజేసిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ లింకులు ద్వారా మోసానికి పాల్పడి బ్యాంకు వివరాలు సేకరించారు. అనంతరం విడతల వారీగా ఖాతా నుంచి నగదు మాయం కావడంతో అనుమానం వచ్చిన రైతు బ్యాంక్ స్టేట్‌మెంట్ పరిశీలించగా మోసపోయినట్లు గుర్తించాడు. దీంతో వెంటనే వీఎం బంజర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ నేరగాళ్లు ఉపయోగించిన ఫోన్ నంబర్లు, బ్యాంకు లావాదేవీల వివరాలను పోలీసులు సేకరిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జిల్లాలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఓటీపీలు, బ్యాంక్ పాస్‌వర్డులు, ఏటీఎం వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని పేర్కొన్నారు. అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నారు.

